జట్కావాడు

హిందీమూలం :
శ్రీ విశ్వంభరనాథ్ శర్మ "కౌశిక"

అనువాదం :
శ్రీ కొల్లిపర సౌభాగ్యరావు

(గతసంచిక తరువాయి)

నామాట వినగానే యజమాని మనస్సు చిలికినట్లయింది. "అసలు విషయ మేమిటో చెప్పు" అని మెత్తబడి అడిగాడు.

"ఆ విషయం మనవిచేసుకున్నందువల్ల లాభమేమీ వుండదు నా లెక్క చూచి జీతం దయచేయించండి."

అయినా యజమాని నన్ను వదలలేదు. చెప్పేదాకా పట్టుబట్టాడు. గత్యంతరం లేక నేను జరిగిన ఘట్టమంతా పూసగ్రుచ్చినట్లు చెప్పివేశాను. యజమాని నామాటలు నమ్మడని నామనస్సులో వేధించుతూనే ఉంది. నేను భావించినట్లు జరుగలేదు. యజమాని నావీపు నిమురుతూ "శభాష్ శ్యామలాల్, నేను నీమాటలు నమ్మాను. నాకు చాల ఆనందం కల్గింది. ఇక నీవు నిర్భయంగా, నిస్సంకోచంగా, సంతోషంగా వుండు. నీకేమీ భయం లేదు. నీవంక కన్నెత్తి చూచేవాడెవడూ ఉండడు. నాదీ జవాబుదారీ, నీకే అపకారం కల్గినా" అని హామీ చేశాడు. అప్పటినుంచి నా కెవరన్నా లెక్క లేదు. రాజునైపోయాను. ఎక్కువగా యజమానితో బయటి పనుల్లోనే పాల్గొంటున్నాను. ఇంట్లోకి వెళ్లటం లేదు. పిమ్మట యజమానురాలు నన్ను నౌకరీలోనుంచి తీయించివేయాలని లక్షప్రయత్నాలు చేసింది. యజమాని ఆమె మాటలను లేశమంతైనా లక్ష్యం చేయలేదు. కోరలు పూడబీకిన సర్పమైపోయింది.

ఇట్లా ఒక సంవత్సరం గడిచింది. ఈ మధ్య యజమాని పినతండ్రి కుమారుడు ఎక్కువగా రాకపోకలు ప్రారంభించాడు. అతడు ఇరవై, ఇరవైయైదు సంవత్సరాల ప్రాయంగలవాడు. ఆరోగ్యవంతుడు. ఒడ్డూ, పొడుగూ గలమనిషి. అతని రాకపోకలలో మొదట నాకేం సందేహం కల్గలేదు. కాని అతని రాకపోకలు హద్దుమీరి పోయినవి. యజమానిరాలితో గంటలకొలది కూర్చొని మాట్లాడుతూ ఉండటం చూచాను. ఇందులో ఏదో కిటుకున్నదని నాకు అనుమానం కల్గింది. యజమాని ఎప్పుడూ దుకాణం దగ్గర ఉంటూ ఉండడంవల్ల ఆయనకు ఈరహస్యం తెలియనే తెలియదు. ఆయింట్లో నీళ్లు పోస్తూఉండే యింకో నౌకరు ఉన్నాడు. యజమానురాలు వాడినోరు కట్టివేసింది.

ఈ రహస్యం బయటకు పోక్కే అవకాశమే లేదు. ఇక ఈ రహస్యోద్ఘాటన నావల్లనే జరగాలి యజమానికి. రహస్యాన్వేషణకు నడుము బిగించాను. చివరకు వారిరువురి పాపకార్యం కన్నులారా చూచాను. వెంటనే యజమానికి తెలియజేశాను. నామాటను యజమాని మనస్సులో దాచిఉంచాడు. ఒకవారం గడిచింది. యజమాని నన్ను పిలిచి- "శ్యామలాల్, నీమాట సత్యమేనోయ్. ఇవాళ నేనూ ప్రత్యక్షంగా చూచాను. నీవు చెప్పినప్పటినుండీ ఈ అన్వేషణలోనే ఉన్నాను. నేడు నీమాట సత్యమని బోధపడింది. ఇప్పుడేమి చేయమంటావో చెప్పు" అని అన్నాడు.

"నేచెప్పేదేముంది బాబూ, తమకు న్యాయమని తోచిందేదో చేయండి."

"నేనీవయస్సులో వివాహంచేసుకొని పొరపాటుచేశాను. కాని ఇప్పుడేం చేయమంటావు ?"

"తమ తమ్ముణ్ణి ఇక రానివ్వకండి. ఇదే మంచి ఊహగా తోస్తున్నది. ఇంతకంటె మనమేమిచేయగలం ?"

"అవును, ఇదే చక్కటి ఉపాయం. దీన్ని ఇంట్లోనుంచి గెంటి వేద్దామన్నంత కోపం కల్గుతూవుంది. ఈ విధంగా చేస్తే వంశానికి అమర్యాద. ఈ వయస్సులో పెండ్లి ఎందుకు చేసుకోవాలి, ఎందుకు ఇంట్లోనుంచి వెళ్లగొట్టాలని సంఘంచెప్పుకొని నవ్వుతుంది."

"నిజమే, మీరుచెప్పినది బాగానే ఉన్నది. అతని ఆట కట్టేటట్లు రాకపోకలు ఆపివేయించండి. ఆరోజునుంచే యజమాని లేనిదే బయటి వ్యక్తులుగాని, బంధువులుగాని ఎవరూ లోపలకు రాకూడదని శాసనం చేయబడింది. ఎవరినీ లోపలకు పోకుండా చూచేభారం నాకు వప్పగించారు. యజమాని పినతండ్రి కుమారుణ్ణి నేను ఆరోజునుంచీ లోపలకు రానివ్వనేలేదు. అతడు నాకెన్నో ప్రలోభాలు చూపాడు, బెదిరించాడు, భయపెట్టాడు. నేనతని ఆశలకు, బెదిరింపులకు లొంగలేదు. వాటి నన్నింటినీ అలక్ష్యం చేశాను. యజమానురాలున్నూ నన్నెంతో బ్రతిమాలింది, స్తుతించింది. అయినా నేను మెత్తబడలేదు. నీళ్లు తెచ్చేవాడు - "జరుగుతూ ఉన్నదేమో జరుగనియ్యి. వాటితో నీకెందుకు లేనిపోయింది" అని నీతి చెప్పవచ్చాడు. నేను - "నువ్వు చెప్పవచ్చావటరా! ఇంట్లోతిని ఇంటి వాసాలు లెక్కబెట్టిన చందంగా యజమాని ఉప్పు, పులుసు తిని ఆయనకే మోసం చేయటమా! నీవు చూడగా వచ్చిమోసగాడివలె ఉన్నావు. నాల్గురోజులు బ్రతుకదలచితే నోరు మూసుకుని మెదలకుండా ఉండు, లేకపోతే రేపే పాటికి నౌకరీలోనుంచి తీసివేయించుతా"నని బెదరగొట్టాను.

నామాటలు విని నీళ్లుతెచ్చేవాడు బ్రతుకు దేవుడా అని మౌనం వహించాడు.

కొన్నాళ్లకు యజమాని బంధువు అసలు ఇంటికి రావడమే మానివేశాడు. యజమానితో మాట్లాడుటకు కొట్టుదగ్గరకు కూడ రావడంలేదు. ఇంతవరకు జరిగిందేమో సవ్యంగానే జరిగింది, బాగానే ఉంది. గండం గడచిందని నేననుకున్నాను.

ఆరుమాసాలు గడచిన తర్వాత ఒకరోజున యజమానికి కలరా తగిలింది. వెంటనే డాక్టర్లను, వైద్యులను పిలిపించి హడావుడిగా మందుమాకులు ఇప్పించాను. ఎన్ని యత్నాలు చేసినా ఫలించలేదు. యజమాని ఈ౯లాభం లేదనుకున్నాడు. నన్ను మంచందగ్గరకు పిలిచి "శ్యామలాల్, నేను నిన్ను నౌకరుగా తలంచడంలేదు. బిడ్డగా చూచుకుంటున్నాను. అందుచేత నా కొట్టు తాళం చేతులు నీకిస్తున్నాను. నా మరణానంతరం తాళపు చేతులు నా కుమారుడికి ఇవ్వాలి. ఎవరినీ, వాడు రానంత వరకూ కొట్టును తెరువనివ్వవద్దుసుమా. నిన్ను అపేక్షించే ఆఖరుసేవ యిదే" అని కోరాడు.

"తమ ఆజ్ఞను ప్రాణాలు అర్పించియైనా అక్షరాలా పాలించి తీరుతాను." అని యజమానికి మాటయిచ్చాను. నామాటలు విన్న తర్వాత యజమాని అయిదు వేల రూపాయల సంచి నాకిస్తూ "ఈసంచి తీసుకో. దీనిని నేను సంతోషంగా యిస్తున్నాను" అని అన్నాడు. నేనది తీసుకోలేదు. వద్దన్నాను. కాని యజమాని "నీవిది తీసుకొనకపోతే నాకు చాల దుఃఖం కల్గుతుంది" అని బలవంత పెట్టాడు. బలవంతంమీద విధిలేక ఆసంచిని తీసుకున్నాను. నాల్గు గంటలు గడిచినవో లేదో యజమాని అసువులు వొదిలాడు. ఆయన కుమారునకు ఆయన చనిపోవుటకు మూడు గంటలకు ముందే తంతినిచ్చాను. చనిపోయిన అయిదు గంటలకు కుమారుడు మైనపురి చేరాడు. యజమాని రాత్రి యెనిమిది గంటలకు కాలధర్మమొందాడు. కుమారుడు రాత్రి రెండు గంటల ముమారులో వచ్చాడు. యజమాని చనిపోయిన పిమ్మట యజమానురాలు "కొట్టు తాళపు చేతులు తనకివ్వ"మని అడిగింది. నేను "తాళపు చేతులు శివచరణలాల్‌గారికే యిస్తాను. యజమాని యాజ్ఞాపించింది ఇదే. వారికే యిస్తాను. ఇంకొకరికి ఇవ్వను" అని చెప్పాను. ఆమె "ఓరి పిచ్చివాడా, తాళపు చేతులు ఈవిధంగా చేస్తే నీవు పొందేది ఏముంది? కొట్టుతాళం తీసి డబ్బు లాటువేసుకో, నాకేమీ యివ్వవద్దు. అంతా నువ్వేతీసుకో, నేనూ నీతోటే ఉంటాను. నీవెక్కడికి వెళ్లుతావో నేనూ అక్కడికే వస్తాను" అన్నది. నేను "ఈ పని నావల్లకాదు. నేను నిన్నెక్కడికి తీసుకుపోయి ఉంచుతాను? అదిన్నిగాక నీవు నన్ను పుత్రునితో సమానంగా భావించుకొన్నటువంటి యజమాని భార్యవు. నాకు తల్లివంటి దానవు. నిన్ను నాభార్యగా స్వీకరించే శక్తి నాలోలేదు, క్షమించు" అని చెప్పాను.

బాబుగారూ! ఆమె ఎంతో బ్రతిమాలింది, నచ్చచెప్పింది, స్త్రీ సహజంగా ఏడ్చింది. నమస్కారం చేసింది. నేనుమాత్రం ఆమె మాటలలో నొక్కదానినీ చెవినిబెట్టలేదు. చివరకు ఏయుపాయము కానక తనమరదిని - మేమెవరినైతే యింటికి రానివ్వకుండా చేశామో - పిలిపించింది. ఆయన వచ్చీ రావడంతోటే తనఠీవిని, దర్పాన్ని ప్రదర్శించాడు. నన్ను పోలీసులకు వప్పగించుతానని బెదురుపెట్టాడు. ఆయన బడాయికిగాని, బెదరింపులకు గాని నేనుమాత్రం జంకలేదు. తాళం పగలగొట్టుటకు సిద్ధపడ్డాడు. నేను కొట్టు దర్వాజా ముందు లాఠీఒకటి చేతబుచ్చుకొని కూర్చున్నాను. "తాళం పగలగొట్టుటకు వచ్చినవాని సిరస్సు ఒక్కవేటుకు పగలకొడతాను. ఆతర్వాత జరిగేదేదో చూచుకుంటా" అని అతనితో నిర్భయంగా చెప్పాను. దానితో అతడు సాహసించలేక పోయాడు. ఈ పోట్లాటతో రాత్రి రెండు గంటలైంది. యజమాని కుమారుడు శివచరణలాల్ వచ్చాడు. తాళపుచేతులు ఆయనకిచ్చి వేశాను. పరిస్థితి అంతా వివరంగా చెప్పాను.

అయ్యా! కొట్టుతలుపులు తెరిచి చూస్తే దానిలో డెబ్బదివేల రూపాయల రొఖ్ఖం ఉంది. ఈ సొత్తు సంగతి యజమానికి తప్ప యింకెవరికీ తెలియదు. నేను యజమానురాలి మాట మన్నించి ఇరవై, ఇరవైయైదువేల రూపాయలు తీసుకుంటే ఎవరికీ సందేహం, అనుమానం కల్గేదికాదు. కాని నామనస్సులో ఈ దుర్బుద్ధి పుట్టలేదు. ఇందుకు కారణం లేక పోలేదు. మాఅమ్మ నిత్యమూ రామాయణం పారాయణచేసి చెబుతూ వుండేది. ఆమె నాకు నిత్యమూ బాబూ, "మోసము, పాపము, ఎన్నడూ చేయవద్దు. ఈరెంటికి దూరంగా వుంటే నీకు కష్టములు, దుఃఖములు కలుగవు" అని బోధిస్తూ ఉండేది. ఆమె ఉపదేశాలు నామనస్సులో నాటుకుపోయినై. అందువల్ల నేనీ పాపకార్యానికి ఒడిగట్టలేదు. నేచేసేపనికి శివచరణలాల్ ప్రసన్నుడైనాడు. నాకు ఒక వేయ్యిరూపాయలు ఇచ్చాడు. ఇస్తూ - నువ్వు "నాదగ్గరనేఉండు" అని అన్నాడు. యజమాని మరణమొందినప్పుడు నాకు కల్గిన అనుభవాన్ని పురస్కరించుకొని అక్కడ ఉండుట భావ్యమని తోచలేదు. యజమాని క్రియాకర్మలు సంపూర్ణమైన తరువాత పదమూడోరోజున నేను నౌకరీ మానివేశాను. నాకు లభ్యమైన ఆరువేల రూపాయలలో రెండువేల రూపాయలతో నాచెల్లెలి వివాహం చేశాను. రెండువేల రూపాయలతో నేను వివాహం చేసుకున్నాను. ఒకవెయ్యి రూపాయలు నిల్వయుంచుకొని, మిగిలిన వెయ్యి రూపాయలతో ఒక దుకాణంపెట్టాను. ఈసారికూడ వ్యాపారంలో నష్టమేవచ్చింది. అంతటితో నేను మైనపురీ వదలివేశాను. ఇక్కడకు చేరుకున్నాను. నౌకరీ చెయ్యాలనే ఉద్దేశ్యంలేదు. అందుచేత గుఱ్ఱాన్ని, బండిని కొన్నాను. బాడుగకు తోలటం ప్రారంభించాను. అప్పటినుంచీ ఈపనిచేస్తున్నాను. ఇలాగే నాజీవితం ఆనందంగా గడచి పోతూఉంది. నేనొకరికి ఒకకాసీ అప్పులేదు,

నాకింకొకరు ఒక కానీ యివ్వనక్కరలేదు. నాకథంతా విన్నారు. ఇక తమరే శలవివ్వండి - బండిలోనుండి దిగివెళ్లిన బాబుగారు నాల్గణాల కోసం నేనుమోసం చేస్తానన్నాడు. అటువంటి వ్యక్తికి నేనేమి జవాబు చెప్పగలను? ఇదాలోకం. ప్రజలా కాకుల వంటివాళ్లు. ఎవరిఇష్టం వచ్చినట్లు వాళ్లు అంటూనే ఉంటారు. నేనూ అందరిమాటలూ వింటూవుంటాను. జట్కావాళ్లకు మర్యాదలేదు. అందుచేత నేనూ యెవరు యేమన్నా వింటూ వుంటాను.

శ్యామలాలు కథంతా విని నేను నిశ్చేష్టుడనైపోయాను. పిమ్మట నేను "సోదరా! నువ్వు మహత్తరమైన వ్యక్తివి. ఋషివంటివాడవు; వందనీయుడవు. నిన్ను దర్శించినవారు తరిస్తారు. నీపాదాలను స్పృశించాలని నా ఆత్మ అభిలషిస్తూ వుంది" అన్నాను.

శ్యామలాలు చిరునవ్వు నవ్వుతూ "బాబూ! నాకు లేనిపోని గొప్పదనాన్నేదో ఆపాదిస్తున్నారు, కాని తమరు వర్ణించిన గొప్పదనము, మహత్తు నాలో లేనేలేదు. నాపాదాలేమిటి తమరు తాకటం మేమిటి? రామ! రామ! నేనేమైనా సాధువునా, ఋషినా?" అని అన్నాడు.

నేను "సాధువులంటే ఎట్లా వుంటారు? కాషాయ బట్టలు కట్టినవారే సాధువులా? వారు కేవలం బూటకపు సాధువులు. నీవంటివాడే నిజమైన సాధువు, సత్పురుషుడు" అని అనగానే శ్యామలాలు నవ్వుల వర్షం కురిపించాడు. ఇంతలో గంగాపుర్ గ్రామం వచ్చింది. బండిదిగి మేము మానిర్ణీత స్థలమునకు వెళ్లాము.

దారిలో నేను మనోహర్‌లాల్‌తో "ఈప్రపంచంలో ఎంతోమంది రత్నముల వంటివారు కనువులోని కండిగింజవలె దాగి ఉన్నారు. వారి నెవరూ గుర్తించలేరు" అని అన్నాను.

మనోహర్‌లాల్ "అవునవును. గొప్పగొప్ప పేర్లు పెట్టుకొని మోసంచేసే సాధువులు ఈశ్వరునివలే పూజింప బడుతున్నారు. ఇటువంటి సత్పురుషులను సంఘం ఏమాత్రం గుర్తించటంలేదు" అన్నాడు.

♦ ♦ ♦

ఇది జరిగి చాలా కాలం అయింది. వందనీయుడు, పూజనీయుడు శ్యామలాల్ ఇంకా బ్రతికి వున్నాడో లేడో తెలియదు. కాని అతను ఎప్పుడు జ్ఞాపకం వచ్చినా అతని కల్పిత మూర్తికి నా ఆత్మ నమోవాకాలర్పిస్తుంది.

——(:o:)——